విష్ణు, ఈశ్వర, బ్రహ్మ ముగ్గురూ
అన్నదమ్ములంట!
ఈ భూదేవి ఆకాశవాణికీ
వీరె కర్తలంట!

వారి మహిమతో చేసిరీ ఒక
మట్టిబొమ్మనంట
ఈ తొమ్మిది కిటుకుల దర్వాజా
మాటలాడుకుంట ॥విష్ణు॥

వస్తావట్టిది పోతావట్టిదె
ధర్మము తనవెంట
సాంబశివుడు నిను పిలువనంపినడు
జల్దిగ రమ్మంట ॥విష్ణు॥

చేతిలో బెల్లం ఉన్నంతసేపే
కాకి బలగమంట
చేతిలో బెల్లం సరిపోయినాక
ఎవరు రారు వెంట ||విష్ణు||

ఇంటి ముంగిటా పిల్లమేకలు
ఇల్లు బలగమంట
ఏడ్చేవారు మరి ఆర్చేవారు
ఎవరు రారు వెంట ||విష్ణు||

తొలినాడు యములోళ్ళనైన తను
గుంజుకు రమ్మంటా
యములోళ్ళంతా చుట్టు నిలిచినరు
తాళ్ళూ తెమ్మంటా! ||విష్ణు||

చిన్నపెద్దలూ కూర్చున్నారు
చింతలు పడుకుంట
నీళ్ళుబోసి కూర్చుండబెట్టినరు
మాయ బొమ్మనంట ॥విష్ణు॥

పువ్వులదండలు వేసినారయ్యా
మాయ బొమ్మకంట
దింపుడు కల్వము
కాడ దింపినరు
మాయ బొమ్మనంట! ॥విష్ణు॥

సొమ్ము సమస్తము తీసుకున్నరూ
పోతరు వారంత
గురువు పోస్తాడూ
సంఖు తీర్థమూ
ముక్తిఫలము కంటా! ||విష్ణు||

మంట్లో మన్ను కలిపినారు ఈ
మాయ బొమ్మనంటా
ధన ధాన్యంబులు
ఎవరి పదార్థము
ధర్మమె తన వెంట
చేసిన పుణ్యము పాపకర్మములె
వచ్చును తన వెంట! ||విష్ణు||